క్లుప్తంగా

ఎస్‌ఆర్‌పురంలో సీసీరోడ్డు నిర్మాణం



ఎస్‌ఆర్‌పురంలో నిర్మిస్తున్న సీసీరోడ్డు

మక్కువ: మండలంలోని ఎస్‌ఆర్‌పురం గ్రామంలో సర్పంచ్ బెల్లాన కృష్ణమూర్తి పర్యవేక్షణలో అధికారులు సీసీరోడ్డు నిర్మిస్తున్నారు. గడపగడపకూ మనప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామంలో డిప్యూటీసీఎం పీడిక రాజన్నదొర ఇటీవల పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో సీసీరోడ్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు సర్పంచ్ కృష్ణమూర్తి ఆయనకు విన్నవించారు. దీంతో గడగడపకూ మనప్రభుత్వం కార్యక్రమం నిధులు సుమారు రూ.2లక్షలు మంజూరుచేయడంతో సీసీరోడ్డు నిర్మాణపనులను సర్పంచ్ కృష్ణమూర్తి శుక్రవారం చేపట్టారు. ఎన్నో ఏళ్లనుంచి సీసీరోడ్డు లేక ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులు ఈ సందర్భంగా సంతోషం వ్యక్తం చేశారు.

నేడు వాహనాల వేలం

మక్కువ: సారా తరలింపులో పట్టుబడిన వాహనాలను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శనివారం వేలం వేయనున్నట్లు ఎస్సై జి.పైడిరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 28మోటార్ సైకిల్స్, 4ఆటోలు వేలం వేయనున్నామని, ఆసక్తి కలిగిన వారు వేలంపాటలో పాల్గొనాలని కోరారు.

గడపగడపకు నిధులతో పనులు వేగవంతం చేయాలి



అంటిపేటలో అభివృద్ధి పనులపై చర్చిస్తున్న ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో గడపగడపకు మనప్రభుత్వం నిధులతో మంజూరైన అభివృద్ధి పనులు ప్రారంభించి వేగవంతం చేయాలని ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ కోరారు. ఈ మేరకు శుక్రవారం వివిధ గ్రామాల్లో జరిగిన పనులను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ మండలంలోని 20 సచివాలయాల పరిధిలో ఉన్న గ్రామాల్లో ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యంలో గడపగపడకు మనప్రభుత్వం కార్యక్రమం పూర్తయిందన్నారు.

ఘనంగా అన్నదానం



శ్రీరామ్మూర్తి దంపతులను సన్మానిస్తున్న భజనమండలి సభ్యులు

పార్వతీపురం: మండలంలోని సంగంవలస గ్రామంలో శ్రీ జై సంతోషిమాత అష్టోత్తర శత భజనావళి బృందం సభ్యుల ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా అన్నదానం నిర్వహించారు. భజన బృందం సభ్యులు 108 గ్రామాల్లోని రామమందిరాల్లో 108 రామభజనలు పూర్తి చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని డొంకాడ శ్రీరామ్మూర్తి ఆధ్వర్యంలో రెండు రోజుల నుంచి రామమందిరం వద్ద ప్రత్యేకంగా సామూహిక కుంకుమ పూజ నిర్వహించారు. శుక్రవారం శ్రీరామ్మూర్తి ఆధ్వర్యంలో 108 గ్రామాల్లోని భజన బృందం సభ్యులను ఆహ్వానించి వేడుకగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భజన మండలి సభ్యులు డొంకాడ శ్రీరామ్మూర్తి దంపతులను ఘనంగా సన్మానించి దుశ్శాలువతో సత్కరించారు.

రీసర్వే వేగవంతం చేయాలి



సర్వే పరిశీలిస్తున్న మండల సర్వేయర్, డీటీ

వంగర: గ్రామాల్లో భూముల రీసర్వే వేగవంతం చేయాలని మండల సర్వేయర్ వై.అప్పలనాయుడు అన్నారు. మండల కేంద్రం వంగరలో జరుగుతున్న భూముల రీ సర్వేను శుక్రవారం ఆయన పరిశీలించారు. డ్రోన్ ద్వారా సర్వే పాయింట్లను గుర్తించి సర్వే వేగవంతానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో రీసర్వే డీటీ ఈశ్వరరావు, సాంకేతిక సిబ్బంది, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

ఈ - ఆశ యాప్‌పై అవగాహన

భామిని: బత్తిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి కొండపల్లి రవీంద్ర ఆశాలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా తెచ్చిన ఈ – ఆశ యాప్‌లో గర్భిణుల వివరాల నమోదుపై అవగాహన కల్పించారు. గర్భిణులకు అందుతున్న సేవలు, నెలవారీ తనిఖీలు తదితర అంశాలు నమోదు చేసే విధానాన్ని తెలిపారు. వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష

- సమన్వయంతో విజయవంతం చేయాలి
- డిప్యూటీ సీఎం పీడిక రాజన్న దొర



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం పీడిక రాజన్న దొర

పాచిపెంట: గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి జగనన్న సురక్ష పథకాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రారంభించారని, డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్న దొర అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శనివారం సచివాలయ సిబ్బంది, వలంటీర్లు గృహసారథులకు జగనన్న సురక్ష పథకంపై ఆయన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా అత్యంత పారదర్శకంగా అవినీతి రహితంగా అర్హులందరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు మంజూరు చేస్తుందని చెప్పారు. వివిధ కారణాలవల్ల అర్హులై ఉండి సంక్షేమ పథకాలు రాకపోతే జగనన్న సురక్ష సర్వేలో వారిని గుర్తించి సంక్షేమ పథకాలు అందిస్తారన్నారు. అదేవిధంగా ఆదాయ, కుల, వివాహ, జనన, తదితర ధ్రువీకరణ పత్రాలు అందిస్తారని చెప్పారు. వలంటీర్లు సచివాలయ కన్వీనర్లు గృహసారథులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులందరూ సమన్వయంతో ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల యోగక్షేమాలు తెలుసుకోవాలని వారి సమస్యలు ఏమైనా ఉంటే సురక్ష కార్యక్రమం ద్వారా పరిష్కరించాలని సూచించారు.

మాట్లాడే అర్హత టీడీపీకి లేదు

గిరిజన విశ్వవిద్యాలయం గురించి మాట్లాడే నైతిక అర్హత తెలుగుదేశం పార్టీ నాయకులకు లేదని డిప్యూటీ సీఎం రాజన్నదొర తోసిపుచ్చారు. గత ప్రభుత్వ హయాంలో గిరిజన విశ్వవిద్యాలయం ఎస్.కోట నియోజకవర్గం రెల్లి గ్రామానికి తరలిపోతే అప్పట్లో గిరిజన ఎమ్మెల్సీగా ఉన్న సంధ్యారాణి ఏం చేశారని ప్రశ్నించారు. గిరిజన విశ్వవిద్యాలయం గిరిజన ప్రాంతంలోనే ఉండాలని ప్రధాన ఉద్దేశంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి సాలూరుకు కేటాయించారన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్

అభివృద్ధి పనులపై ఆరా..

జగనన్న సురక్ష అవగాహన కార్యక్రమం అనంతరం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని ఎంపీపీ చాంబర్‌లో ఇంజినీరింగ్ అధికారులతో డిప్యూటీ సీఎం రాజన్నదొర మాట్లాడారు. మండలంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులపై ఆరా తీశారు.

వచ్చే నెలలో సీఎం పర్యటన

వచ్చే నెలలో సాలూరు నియోజకవర్గంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పర్యటన ఉంటుందని ఉప ముఖ్యమంత్రి రాజన్న దొర పార్టీ నాయకులు కార్యకర్తలకు తెలిపారు. సాలూరు లేదా మెంటాడ మండలంలో ఉండవచ్చని, సీఎం పర్యటన విజయవంతం చేసేందుకు పార్టీ నాయకులు కార్యకర్తలు సంసిద్ధం కావాలని కోరారు. పై కార్యక్రమాల్లో ఎంపీపీ బడ్నాన ప్రమీల, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గొట్టాపు ముత్యాల నాయుడు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శులు పాచిపెంట వీరం నాయుడు, డోల బాబ్జీ, ఏఎంసీ చైర్మన్ దండి అనంతకుమారి, జేసీఎస్ కన్వీనర్ తట్టికాయల గౌరీశ్వర రావు, వైస్ ఎంపీపీలు మీసాల నారాయణ, కోరిపల్లి రవీంద్ర పలువురు సర్పంచులు ఎంపీటీసీలు, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్న సురక్షను విజయవంతం చేయాలి

సాలూరు: నేటి నుంచి మండలంలో జరగబోయే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్ కోరారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని జీగిరాం గ్రామ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమంపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సచివాలయం పరిధిలో వలంటీర్లు యాప్‌లో జగనన్న సురక్ష సర్వే చేయాల్సి ఉంటుందని వివరించారు. వలంటీర్లందరూ తమ పరిధిలోని ప్రతి ఇంటికి వెళ్లి శతశాతం సర్వే చేయాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు సర్పంచ్, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ దగ్గర సీపీఎం ధర్నా

- ఏఈకి వినతిపత్రం అందజేత

సీతానగరం: పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని కోరుతూ అప్పయ్యపేట విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట సీపీఎం మండల కార్యదర్శి రెడ్డి ఈశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీపీఎం జిల్లా నాయకుడు రెడ్డి లక్ష్మునాయుడు మాట్లాడుతూ కార్పొరేట్లకు విద్యుత్ వాడకంపై రాయితీలిస్తూ సామాన్య ప్రజల నుంచి పన్నుల పేరుతో అధిక బిల్లులు వసూలు చేయడం దురదృష్టకరమన్నారు.విద్యుత్ చార్జీలు పెరగడం వల్ల పేదలు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికే నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగిపోతున్న సమయంతో విద్యుత్ చార్జీలు పెంచడంతో ఆర్థికంగా కుంగిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించే వరకూ దశల వారీగా విద్యుత్ వినియోగదారులతో కలిసి ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఏఈ సోమేశ్వరరావుకు అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు బి.అప్పారావు, గవర వెంకటరమణ,రెడ్డి రమణమూర్తి, రెడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.



ఏఈ సోమేశ్వరరావుకు వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకుడు ఈశ్వరరావు

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు

- ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం



పార్వతీపురం టౌన్: విద్యాశాఖలో 25 ఏళ్లగా పెండింగ్‌లో ఉన్న ఎంఈఓ పోస్టుల వివాదాన్ని పరిష్కరించిన సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఏపీ ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం పక్షాన కృతజ్ఞతలు తెలియచేస్తున్నట్లు ఆ సంఘం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం తెలిపారు. ఇటీవల 679 ఎంఈఓ-2 పోస్టులను జెడ్పీ హెచ్ఎంలతో భర్తీ చేశారని, అదేరీతిలో ప్రస్తుతం ఖాళీగా ఉన్న ఎంఈఓ-1 పోస్టులను ప్రభుత్వ హైస్కూల్ హెచ్ఎంలతో భర్తీ చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని పేర్కొన్నారు. ఎంఈఓ పోస్టుల భర్తీకి కృషి చేసిన విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్, విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్ కుమార్‌లకు ధన్యవాదాలు తెలియచేస్తున్నామన్నారు.

ముగిసిన రథయాత్ర

పాలకొండ: స్థానిక జగన్నాథస్వామి రథయాత్ర శుక్రవారంతో ముగిసింది. తొమ్మిది రోజులుగా నిర్వహించిన రథయాత్రలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి దర్శనం చేసుకున్నారు. చివరి రోజు రథం ప్రధాన ఆలయం వరకు తీసుకువచ్చి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం విగ్రహాలను ప్రధాన ఆలయంలోనికి తీసుకువెళ్లడంతో యాత్ర ముగిసింది. ఆలయ ఈవో వి.రాధాకృష్ణ, పోలీసు సిబ్బంది యాత్ర విజయవంతం చేయడంతో కృషి చేశారు.

అధైర్య పడొద్దు అండగా ఉంటాం

సాలూరు:

కష్టాలు వచ్చాయని అధైర్య పడవద్దని ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అండగా ఉంటుందని బాధిత కుటుంబానికి ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖామంత్రి పీడిక రాజన్నదొర ధైర్యం చెప్పారు. తన కూతురు జస్విత కంజనిటల్ డిఫార్మిటీతో బాధపడుతోందని, సాయం చేయాలని పట్టణానికి చెందిన మక్కువ శ్రీలక్ష్మి ఈ నెల 28న కురుపాం వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డిని కోరింది. దీనికి వెంటనే స్పందించిన సీఎం జగన్‌మోహన్ రెడ్డి వారికి తక్షణమే ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ మేరకు తక్షణ సాయంగా లక్ష రుపాయల చెక్కును ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర సాలూరులోని తన గృహంలో బాధితులకు శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా ఆ కుటుంబానికి అధైర్య పడవద్దని అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మక్కువ జెడ్పీటీసీ మావుడి శ్రీనువాసులునాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు దండి శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.



బాధిత కుటుంబానికి చెక్కును అందిస్తున్న ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

అభివృద్ధికి పలు ప్రతిపాదనల ఆమోదం

పార్వతీపురంటౌన్:

పార్వతీపురం పట్టణం అభివృద్ధిపై ప్రతిపాదించిన పలు తీర్మానాలను ఆమోదించినట్లు ఎమ్మెల్యే జోగారావు తెలిపారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ అభివృద్ధికి నిరంతరం కృషిచేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

పార్వతీపురం మున్సిపాలిటీ పరిధి కొత్తవలస ప్రాంతంలోని 9వ వార్డులో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే జోగారావు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ అభివృద్ధి పనుల్లో భాగంగా సీసీ రోడ్లు, కాలువలు పూర్తి చేయనున్నట్లు చెప్పారు. వార్డు ప్రజలకు గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇచ్చిన మాట ప్రకారం అన్ని హామీలు నెరవేరుస్తామని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బి.గౌరీశ్వరి, వైస్‌చైర్మన్ యిండుపూరి గున్నేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

రైతులకు మేలైన సాగు పామాయిల్

- అధిక దిగుబడి విత్తనం థాయిలాండ్ నుంచి దిగుమతి
- శ్రీనివాసా పామాయిల్‌మిల్ సీఈఓ



పంపిణీకి సిద్ధం చేస్తున్న పామాయిల్ మొక్కలు



శ్రీనివాసా పామాయిల్ నర్సరీలో నాటిన విత్తనాన్ని పరిశీలిస్తున్న సీఈఓ మణిదీప్ కృష్ణ

సీతానగరం:

పార్వతీపురం మన్యం జిల్లాలో పామాయిల్ తోటలను అభివృద్ధి చేయడంలో ముందువరసలో ఉన్న సంస్థ శ్రీనివాసా పామాయిల్‌మిల్ యాజమాన్యం రైతుల అభివృద్ధితో పాటు సంస్థ అభివృద్ధికి తోడ్పడే విధంగా పనిచేస్తుందని సంస్థ సీఈఓ పి.మణిదీప్ కృష్ణ అన్నారు. ఈ మేరకు శుక్రవారం బగ్గందొరవలస శ్రీనివాస పామాయిల్ నర్సరీలో ఆయన మాట్లాడుతూ రైతులకు అధిక దిగుబడి ఇచ్చే పామాయిల్ మొక్కలను పంపిణీ చేయడానికి అవసరమైన విత్తనాల మొక్కలు నర్సరీలో అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. కొంతకాలంగా దేశీయ పామాయిల్ మొక్కలను సరఫరా చేస్తున్నప్పటికీ అధిక దిగుబడులకోసం థాయిలాండ్ దేశం నుంచి క్లోనల్ పామాయిల్ మొక్కలను సమకూర్చి నర్సరీలో సుమారు 50 వేల మొక్కలను అత్యాధునికమైన పద్ధతులతో పెంచుతున్నామని చెప్పారు. ఈ మొక్కలు ఎక్కువ కాపునిస్తాయని, దీంతో ఆయిల్‌శాతం ఎక్కువగా రావడం వల్ల సంస్థ మనుగడ, రైతులకు గిట్టుబాటు ధర బాగుంటుందని తెలిపారు. నర్సరీలో తయారు చేస్తున్న మొక్కలు 2024లో రైతులకు అందుబాటులోకి వస్తాయన్నారు. అలాగే దేశీయంగా ఉన్నపామాయిల్ మొక్కలు రైతులకు పంపిణీ చేయడానికి 42 వేలు అందుబాటులో ఉన్నాయని తెలియజేశారు. రైతు సోదరులు గోల్డెన్ క్రాప్ ఆయిల్ పాం తోటలను వేసుకుని వాణిజ్యపరంగా అభివృద్ధి పథంలో నడుస్తూ సంస్థ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం వెరైటీ మొక్కలను రైతుల కోరిక మేరకు తెలంగాణలోని నర్సరీనుంచి తెచ్చి ఇవ్వనున్నట్లు చెప్పారు. మొక్కల వివరాల కోసం నర్సరీ ఇన్‌చార్జి కె శ్రీనివాసరావు 9666991115, ప్లాంటేషన్ మేనేజర్ 8309922369 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

మున్సిపల్ సమావేశంలో ప్రజాసమస్యలపై చర్చ



మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో సభ్యులు

సాలూరు: మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో నెలకొన్న సమస్యలపై కౌన్సిల్ సభ్యులు చర్చించారు. ఈ మేరకు శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ అధ్యక్షతన, మున్సిపల్ కమిషనర్ శంకరరావు ఆధ్వర్యంలో మున్సిపల్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ క్రమంలో అజెండాలోని అంశాలను సభ్యులు ఆమోదించారు. వార్డుల్లో సమస్యలపై ఆయా కౌన్సిలర్లు మాట్లాడారు. టీడీపీ ప్రభుత్వం హయాంలో టిడ్కో ఇళ్లకు వివిధ కేటగిరిల్లో డబ్బులు వసూలు చేశారని, ఏళ్లు దాటుతున్నా ఆ డబ్బులు ఇవ్వకపోవడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారని కౌన్సిలర్ బలభద్రుని శ్రీనివాసరావు తెలిపారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ శంకరరావు మాట్లాడుతూ, గత టీడీపీ ప్రభుత్వంలో మున్సిపాలిటీలో సుమారు రూ.66 లక్షలు వసూలు చేశారని, అవి టిడ్కో వద్ద ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే చెల్లింపులు చేస్తామని చెప్పారు. విద్యుత్, తాగునీరు తదితర సమస్యలపై కౌన్సిలర్లు అధికారులను ప్రశ్నించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ జర్జాపుదీప్తి, వైస్‌చైర్మన్ వంగపండు అప్పలనాయుడు. జేసీఎస్ కన్వీనర్ గిరిరఘు తదితరులు పాల్గొన్నారు.

వినతులకు స్పందించిన ముఖ్యమంత్రి



ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన జిల్లా గ్రంథాలయాల చైర్‌పర్సన్ రెడ్డి పద్మావతి (ఫైల్)

సాలూరు: మండలంలో ఉన్న పలు సమస్యలను పరిష్కరించాలంటూ ముఖ్యమంత్రి వైఎస్‌జగన్ మోహన్‌రెడ్డిని కోరగా సానుకూలంగా స్పందించారని జిల్లా గ్రంథాలయాల చైర్‌పర్సన్ రెడ్డి పద్మావతి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆమె ఎంపీడీఓ కార్యాలయంలో మాట్లాడుతూ, ఈ నెల 28న కురుపాం వచ్చిన ముఖ్యమంత్రి దృష్టికి పలు సమస్యలను తీసుకువెళ్లానని చెప్పారు. ముఖ్యంగా గ్రీన్ అంబాసిడర్ల పెండింగ్ జీతభత్యాలు చెల్లించాలని, బాగువలసలో 30 పడకల ఆస్పత్రి నిర్మాణం, శివరాంపురంలో నిలిచిపోయిన బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయించడం, వెంగళరాయ సాగర్ ఎత్తిపోతల పథకం మంజూరుచేయాలని, విన్నవించినట్లు తెలిపారు. తన వినతులపై సానుకూలంగా స్పందించిన సీఎం జగన్‌మోహన్ రెడ్డి వాటి గురించి అక్కడే ఉన్న అధికారులతో మాట్లాడారని పేర్కొన్నారు.

సంక్షేమ సారథి సీఎం జగన్



పెదపెంకిలో లబ్ధిదారుకు బుక్‌లెట్ అందించి వివరిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

- ఎమ్మెల్యే జోగారావు

బలిజిపేట: నిరుపేద ప్రజలకు సంక్షేమ పాలన అందించిన ఏకైక సీఎం జగన్‌మోహన్ రెడ్డి మాత్రమే అని ఎమ్మెల్యే జోగారావు తెలిపారు. బలిజిపేట మండలం పెదపెంకిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి కుటుంబానికి పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి పాలన సాగుతోందన్నారు. దళారులు, సిఫార్సులు, నాయకుల ప్రమేయం లేకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు ప్రజలకు నేరుగా అందుతున్నాయన్నారు. ప్రజల వద్దకు పాలన అందించాలనే సంకల్పంతో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రతి గడప ఎక్కి గడిచిన నాలుగేళ్ల కాలంలో ప్రభుత్వం నుంచి పొందిన పథకాలను లబ్ధిదారులకు తెలియపరచడం, అర్హత ఉండి సంక్షేమ పథకాలకు దూరంగా ఉండే వారిని గుర్తించి వారికి సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకునేందుకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం సంక్షేమంతోపాటు అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని తెలిపారు. అందులో భాగంగా గ్రామాలలో మౌలిక సదుపాయాల కల్పన ఏవిధంగా ఉందో ప్రజలను అడిగి తెలుసుకుని వారికి కావలసిన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు.

తక్షణమే సమస్యల పరిష్కారం

స్థానికంగా ఉండే సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించే దిశగా చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రజలకు సుభిక్షమైన పాలన అందించేందుకు జగన్‌మోహన్ రెడ్డి పాటుపడుతున్నారని అటువంటి నాయకుడిని మళ్లీ ఆశీర్వదించి రానున్న కాలంలో ఆయననే సీఎంగా చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎస్.పాపారావు, ఎంపీపీ జి.నాగమణి, మండల ఉపాధ్యక్షుడు వి.సాయిరాం, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, జి.జగన్, శ్రీనివాసరావు, సీహెచ్.సత్యం , జి.అప్పలనాయుడు మాస్టారు, టి.సావిత్రమ్మ, శ్రీనివాసరావు, బి.పోలినాయుడు, పలగర సహకార సంఘం అధ్యక్షుడు జి.పకీరునాయుడు, మండల వ్యవసాయ సలహా సంఘం అధ్యక్షుడు గంగయ్య, సర్పంచ్‌లు విజయ, కె.మోహనరావు, సుందరరావు, ఎంపీటీసీ మల్లిక, వి.గురురాజు, టి.ప్రసాదరావు, జి.సత్యం నాయుడు, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా

కొమరాడ: మండలంలోని కళ్లికోట, గుమడ గ్రామాల్లో సమీపంలోని నాగావళి నది నుంచి వందలాదిగా నాటు బండ్లతో ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాగే ఇసుకను తోడేస్తే వర్షాకాలంలో నదీ ప్రవాహం పెరిగితే గ్రామాల్లోకి నీరు వస్తుందని వారు పేర్కొంటున్నారు. నాటు బండ్లతో పగటి పూట దర్జాగా ఇసుకను తరలించి ఎక్కడో ఒక చోట డంపింగ్ చేసి రాత్రిపూట ట్రాక్టర్ల సాయంతో తరలిస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. ఎన్నిసార్లు పోలీసుల, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పార్వతీపురం / సాలూరు
9010204441, 9951602891
Office mail : vzmadvt@gmail.com